# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం 15 జూలై 2024 పేజీలు 8


## జగన్మాత దుర్గమ్మకు భాగ్యనగర్ బోనం



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆషాఢ మాసాన్ని పురస్కరించు కొని తెలంగాణ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని జగన్మాత దుర్గమ్మకు ఆదివారం బంగారు బోనం సమర్పించారు. ముందుగా సీవీ రెడ్డి ఛారిటీస్ స్థలంలో బోనం సిద్ధం -2 లో



## హైదరాబాద్‌లో వర్షం బీభత్సం..

### చెరువులను తలపిస్తున్న రోడ్లు.. కూలిన చెట్లు

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం (జూలై14) సాయంత్రం కురిసిన వర్షానికి నగరమంతా జలమయమయింది. రోడ్లు, రహదారులు చెరువులను తలపిం చాయి. గాలివానకు పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. సిటీలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ ఉప్పొంగింది. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు వర్షంలోనే డ్యూటీలు చేశారు. కొన్ని చోట్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ అంతరాయం ఏర్పడింది. నిజాంపేట్ లో చెరువులను తలపిస్తున్న రోడ్లు -2 లో

# మోసాలు.. ఎగవేతలు రూ.2,289 కోట్లు

- జీఎస్టీ చెల్లింపులపై ఆడిట్, తనిఖీల్లో వెల్లడి
- ఇప్పటికే రూ.167 కోట్ల వసూలు
- అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**జీఎస్టీ చెల్లింపుల్లో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. పన్ను ఎగవేసేందుకు ఎత్తులు వేస్తున్నారు. కాగితాల్లో కంపెనీలను సృష్టించి మరికొందరు మోసాలకు తెరలేపుతున్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ఆరునెలలుగా జరిపిన ఆడిట్, తనిఖీల్లో ఇవి బయటపడ్డాయి. మొత్తం 13,853 వ్యాపార సంస్థల పేరుతో రూ.2,289 కోట్ల జీఎస్టీ ఎగవేతలు, మోసాలు జరిగినట్లు తేలింది. ఇందులో రాష్ట్ర జీఎస్టీ పద్దు కింద రూ.923 కోట్లు, కేంద్ర జీఎస్టీ కింద రూ.919 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.447 కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఎగవేతదారుల నుంచి ఇప్పటివరకూ రూ.167 కోట్లు వసూలు చేసినట్లు వాణిజ్య పన్నులశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. మిగిలిన సొమ్మును తక్షణం వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**మోసాలు ఇలా...**

తెలంగాణలోని పలు వ్యాపార సంస్థల్లో బిహార్, యూపీ వంటి రాష్ట్రాల నుంచి -2 లో






## చేపపిల్లల పంపిణీలో అక్రమాలపై నిఘా

### మత్స్యశాఖ కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో 2024-25 సీజన్‌లో చేపపిల్లల పంపిణీ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్లు, రవాణా, పంపిణీలో అక్రమాలను నిరోధించేందుకు అడుగడుగునా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసింది. -2 లో

# జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌పై సుప్రీంకోర్టులో కేసీఆర్ పిటిషన్

### నేడు సీజేఐ ధర్మాసనం విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో గత భారాస ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరపడానికి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదే అంశంపై జూన్ 24న తాను దాఖలు చేసిన పిటిషన్‌ను -2 లో



# హైదరాబాద్‌లో వర్షం బీభత్సం..

- మొదటి పేజీ తరువాయి
ఆదివారం సాయంత్రం కురిసన వర్షానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, రహదారులు చెరువులను తలపించాయి. దీంతో జనం ఇండ్లను బయటికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. మరోవైపు సైబరాబాద్ పరిధిలో భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ ఎంసీ మాన్ సూన్ బృందం ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు. మణికొండ మున్సిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి. పంచవటి కాలనీలో వర్షపు నీరు జలదిగ్బంధనంతో చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పంచవటి కాలనీ వాసులు బయటికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ముషీరాబాద్ పరిధిలోని రాంనగర్ లో స్ట్రీట్ నెం 17 భారీ వర్షం కారణంగా కాలనీలు నీట మునిగాయి. వరద ఉధృతిలో ఓ కారు చిక్కుకుపోయింది. కారులో ఉన్న నలుగురు వ్యక్తులను స్థానికులు రిస్క్ చేసి కాపాడారు. డోర్లు ఓపెన్ కాకపోవ డంతో నలుగురు వ్యక్తులు కారులోనే ఉండిపోవాల్సి వచ్చింది. స్థానిక యువకులు రిస్క్ చేసి కారును గోడ వైపు తెచ్చి, అద్దాలు పగలగొట్టి నలుగురిని రక్షించారు.

**పంజాగుట్ట పీవీఆర్ థియేటర్ ముందు ప్రేక్షకుల ఆందోళన**

భారీ వర్షం కారణంగా హైదరాబాద్ పంజాగుట్ట పీవీఆర్ థియేటర్ లో వర్షం నీరు వచ్చి చేరింది. దీంతో యాజమాన్యం కల్కి సినిమా ప్రదర్శన నిలివేయాలని ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. షార్ట్ సర్క్యూట్ జరిగి జరగరానిది ఏదైన జరిగితే ఎవరు బాధ్యులు అంటూ థియేటర్ యాజమాన్యాన్ని నిలదీశారు. సినిమా చూసేవారు చూడొచ్చు.. వెళ్లేవారు వెళ్లొచ్చు అని ఎటకారపు సమాధానమి చ్చారని సినిమాకు వచ్చినవారు చెప్పారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎట్టకేలకు ప్రేక్షకుల కోరిక మేరకు కల్కి సినిమా ప్రదర్శన నిలిపివేశారు.

## చేపపిల్లల పంపిణీలో అక్రమాలపై నిఘా

- మొదటి పేజీ తరువాయి
చేపపిల్లల పంపిణీలో అవకతవకలపై ఆది నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో గతంలో ఉన్న నిబంధనలను సమీక్షించి మత్స్యశాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో టెండర్లు, పర్యవేక్షణ, తనిఖీలు కలెక్టర్ల పర్యవేక్షణలో జరిగేవి. తాజాగా క్షేత్రస్థాయి అధికారులకూఈ బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకు టెండర్‌దారులు పాలిథిన్ సంచిలో చేపపిల్లలను చూపించేవారు.. ఇకపై బుట్టలో చూపించాలి. తద్వారా అవి జీవించి ఉన్నది లేనిది తెలుసుకుంటారు. పెద్ద సైజువి సేకరించేందుకు ఒక్కో కిలోలో 250 నుంచి 300 వరకు ఉండాలని నిర్దేశించింది. గతంలో కిలోకు 300 నుంచి 350 సేకరించేవారు. టెండర్ల ఖరారుకు ముందు చేపల క్షేత్రాల్లో ఇకపై రెండు దఫాలు తనిఖీలు జరుగుతాయి. చేపల రవాణా వివరాలు టీమత్స్య మొబైల్‌యాప్‌లో నమోదు చేస్తారు. తద్వారా వాహనాలు క్షేత్రాల నుంచి చెరువులకు చేరే వరకు నిఘా వేస్తారు. చెరువుల్లో వేసిన 12, 24 గంటలకు ఒకసారి చొప్పున స్థానిక సొసైటీ ప్రతినిధులు తనిఖీ చేస్తారు. ఏవైనా చనిపోయినట్లు తేలితే మత్స్యశాఖ అధికారి, పంపిణీదారు తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాల ఆధారంగా చర్యలు తీసుకుంటారు. గతంలో 35 నుంచి 40 మిల్లీమీటర్ల పొడవు గల లక్ష పిల్లల ధర రూ.53,600 నుంచి రూ.61,930కి పెంచింది. 80 నుంచి 100 మిల్లీమీటర్ల పొడవు గల లక్ష పిల్లల ధర రూ.1,50,600 నుంచి రూ.1,61,640కి పెంచింది.

## జగన్మాత దుర్గమ్మకు భాగ్యనగర్ బోనం

- మొదటి పేజీ తరువాయి
చేయగా.. దేవస్థానం వైదిక కమిటీ సభ్యులతో కలిసి దుర్గ గుడి ఈవో రామారావు ప్రదర్శనను ప్రారంభించారు. అక్కడి నుంచి కళాకారులు, పోతురాజులు ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి బంగారు బోనం, పవిత్ర సారె సమర్పించారు. వారికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి, ప్రసాదాలను అందజేశారు. ఈ సంప్రదాయం 15 ఏళ్లుగా కొనసాగుతోంది. కార్యక్రమంలో బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

## మోసాలు.. ఎగవేతలు

# రూ.2,289 కోట్లు

- మొదటి పేజీ తరువాయి
కూలీలు వచ్చి పనులు చేస్తున్నారు. వారికి తెలియకుండా వారి పేర్లతో జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేయించి వ్యాపారాలు చేసినట్లు, జీఎస్టీ కట్టినట్లు బోగస్ పత్రాలు సృష్టించడం ఇందులో తొలి అంకం. తదుపరి ఆ బోగస్ పత్రాలతో జీఎస్టీ రిఫండ్ క్లెయిమ్ చేయడం తదుపరి దశ. చేతిలో వారి ఆధార్ ఉంటే చాలు జీఎస్టీఐఎన్ పొందడం ఎంతో సులభం. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపార లావాదేవీలు అసంఖ్యాకంగా ఉంటాయి కాబట్టి అధికారులు ఇలాంటి మోసాలను గుర్తించి చర్యలకు ఉపక్రమించలేరన్నది సూత్రధారుల నమ్మకం. ఒకవేళ తదుపరి తనిఖీల్లో అక్రమాలు బయటపడినా అంత సులభంగా తమకు శిక్ష పడదని, ప్రధానంగా ఎవరి పేరిట జీఎస్టీఐఎన్ ఉంటే వారి చుట్టూనే కేసు తిరుగుతూ ఉంటుందన్నది వారి విశ్వాసం. ఇదే విషయాన్ని వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి వివరిస్తే ఇలా అక్రమాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపేలా సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా ఆదేశించారు. ఈ క్రమంలో పన్ను వసూళ్లు పెంచడానికి కొత్తగా ఏం చర్యలు చేపట్టాలనే అంశంపై ఈ శాఖ కసరత్తు చేస్తోంది. అవసరమైతే మొత్తం వాణిజ్య పన్నులశాఖను పునర్వ్యవస్థీకరించి తనిఖీల ప్రక్రియను కఠినతరం చేయాలని యోచిస్తోంది.

**సువిధ కేంద్రాలతోనే చెక్...**

జీఎస్టీఐఎన్ పొందేందుకు ఇప్పుడు కేవలం ఆధార్‌తో ఆన్‌లైన్‌లో పని జరిగిపోతుండగా ఇకపై బయోమెట్రిక్ విధానం తేవాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. ఇందుకోసం సువిధ కేంద్రాలను నెలకొల్పాలని స్పష్టం చేసింది. అప్పుడు జీఎస్టీఐఎన్ కావాలనుకునే వారు నేరుగా ఈ కేంద్రానికి రావాల్సి ఉంటుంది. అప్పుడు ఆ వ్యక్తి ఆధార్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి వేలిముద్రలు, ఐరిస్ నమోదు చేసుకొని జీఎస్టీఐఎన్ కేటాయిస్తారు. ఈ కేంద్రాలు ఇంకా రాష్ట్రంలో అమల్లోకి రాలేదు. జీఎస్టీ చెల్లింపులు సక్రమంగా జరిగాయా, లేదా అనేది పక్కాగా తనిఖీ చేస్తున్నట్లు వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ శ్రీదేవి 'ఈనాడు'కు చెప్పారు. కొందరు బోగస్ బిల్లులు, బోగస్ సంస్థలను ఆన్‌లైన్‌లో సృష్టించి సరకులు కొన్నట్లు, అమ్మినట్లు చూపి జీఎస్టీ రిఫండ్ క్లెయిమ్ చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించామని, అలాంటివారందరినీ జైలుకు పంపుతామని ఆమె స్పష్టం చేశారు.

## జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌పై సుప్రీంకోర్టులో కేసీఆర్ పిటిషన్

- మొదటి పేజీ తరువాయి
కొట్టేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ విద్యుత్తు సంస్థలు చేసిన వెయ్యి మెగావాట్ల విద్యుత్తు కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపి, ఆ నిర్ణయాల్లోని నిబద్ధతను తేల్చడానికి రాష్ట్రప్రభుత్వం మార్చి 14న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేయడం.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1952, విద్యుత్తు చట్టం-2003కి విరుద్ధమని, దాన్ని రద్దుచేయాలని కేసీఆర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తు కొనుగోళ్లపై వివాదం ఉంటే.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండళ్లు తేల్చాలే తప్ప.. దానిపై విచారించే అధికారం కమిషన్‌కు లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఏముంది నా దగ్గర ఇవ్వడానికి: కాంగ్రెస్ లో చేరికలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన

## కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నుంచి భారీగా వలసలు

## తాము చేస్తున్న మంచి పనులకు అండగా నిలిచేందుకు వస్తున్నారన్న రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ పని అయిపోయిందన్న వాళ్లు ఇప్పుడెక్కడా కనిపించడంలేదని ఎద్దేవా



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అధికార పక్షం కాంగ్రెస్ పార్టీలోకి విపక్షాల నుంచి భారీగా వలసలు వస్తుండడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ ప్రభుత్వాన్ని పడగొడతామన్నారని, ఇప్పుడు వాళ్లే కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పని అయిపోయిందన్న వాళ్లు ఇప్పుడు ఏం చేస్తున్నారో తెలుసా... వాళ్ల పార్టీలో ఎవరున్నారో, ఎవరు లేరో లెక్కపెట్టుకునే పనిలో ఉన్నారు అని దెప్పిపొడిచారు.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తన వద్ద నేతలకు ఇవ్వడానికేమీ లేదని, అయినా గానీ తాము చేస్తున్న మంచి పనులకు మద్దతుగా నిలిచేందుకే ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతున్నారని వివరించారు.

"మా ప్రభుత్వం మూడు నెలలు కూడా ఉండదన్నారు. ఓడిన వాళ్లను, ఇంట్లో పడుకున్న వాళ్లను, ఫాంహౌస్ లో ఉంటున్న వాళ్లను అడుగుతున్నా... ఈ అవుటర్ రింగ్ రోడ్డు మీ తాత తెచ్చాడా? ఈ అంతర్జాతీయ ఎయిర్ పోర్టు మీ ముత్తాత కట్టాడా?

హైదరాబాదులో ఉన్న ఐటీ పరిశ్రమలను, ఫార్మా పరిశ్రమలను మా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. అవి తెచ్చినందువల్లే హైదరాబాద్ ఇవాళ మహానగరంగా మారింది. హైదరాబాద్ నగరానికి మీరేం తెచ్చారని ఇప్పుడు అడుగుతున్నా. మీరేం తెచ్చారంటే... గంజాయి తెచ్చి ఉంటారు, డ్రగ్స్ తెచ్చి ఉంటారు.

హైదరాబాద్ ను ఇంకా అభివృద్ధి చేసి విశ్వనగరంగా మార్చేందుకు మేం ప్రణాళికలు రూపొందిస్తుంటే... పొద్దున లేస్తే కాళ్లలో కట్టెలు పెట్టే మాటలే. అయిపోయింది అయిపోయింది... కూలిపోయింది కూలిపోయింది అన్నారు. ఆ మాటలు అన్నవాళ్లు ఇప్పుడెక్కడున్నారు?

మేం చేస్తున్న అభివృద్ధిని చూసి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారు. ఎగ్గె మల్లేశం వంటి వాళ్లు రిజర్వ్ బ్యాంక్ కే పైసలు ఇవ్వగలవాళ్లు. వాళ్లకు ఇవ్వడానికి నా వద్ద ఏముంది... నా అంగీ అమ్మినా, లాగు అమ్మినా ఏం రాదు... నేను ఏమిస్తాను వాళ్లకు? మా ఆలోచన విధానం నచ్చి వాళ్లు పార్టీలోకి వస్తున్నారు.

అచ్చోసిన ఆంబోతుల్లా, ఊళ్లలో మైసమ్మకు విడిచిపెట్టిన పోతుల్లా తిరుగుతూ... ప్రభుత్వాన్ని పడగొడతాం, పడగొడతాం అంటున్నారు. మీరు పడగొడతాం అంటే... మేం నిలబడెతాం అంటూ ఆ ఎమ్మెల్యేలు ముందుకొచ్చారు" అంటూ రేవంత్ రెడ్డి వివరించారు.

# పదకొండేళ్ల చిన్నారికి ప్రేమ లేఖలు రాసిన టీచర్.. అమెరికాలో ఘటన

**60 కి పైగా లవ్ లెటర్లు.. పలు కానుకలు ఇచ్చి కౌగిలించుకున్న ప్రబుద్ధుడు**

**బాలిక ఇంటికి, ఆమె వెళ్లే చర్చ్ కు వెళుతూ చనువు పెంచుకునేందుకు యత్నం**

**'టీచర్ ఆఫ్ ది ఇయర్' అందుకున్న వ్యక్తి ఇలా చేశాడని తోటి టీచర్ల ఆశ్చర్యం**

**హైదరాబాద్ పెన్ పవర్:**పవిత్రమైన గురువు స్థానంలో ఉన్న ఓ ప్రబుద్ధుడు తన విద్యార్థినికి ప్రేమ లేఖలు రాశాడు.. కానుకలు ఇస్తూ కౌగిలించుకుంటూ వేధింపులకు పాల్పడ్డాడు. క్లాస్ రూంలో ఉన్నపుడు, స్కూలు ఆవరణలో ఉన్నపుడు ఫొటోలు తీసి దాచుకున్నాడు. స్కూలుకు రాకపోవడంతో బాలిక వెళ్లే చర్చికి వెళ్లడం మొదలుపెట్టాడు. ఈ విషయం గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులకు చేరవేయడంతో డిటెక్టివ్ లు రంగంలోకి దిగి



సదరు టీచర్ అసలు రూపాన్ని బయటపెట్టాడు. అమెరికాలోని సౌత్ కరోలినాలో చోటుచేసుకుందీ ఘటన.

సౌత్ కరోలినాలోని స్టార్ ఎలిమెంటరీ స్కూల్ లో డ్యూక్ టీచర్ గా పనిచేస్తున్నాడు. తన స్కూల్ లో చదివే ఓ పదకొండేళ్ల బాలికకు ప్రేమిస్తున్నానంటూ లెటర్లు రాస్తూ వేధించాడు. దాదాపు అరవైకి పైగా లెటర్లు రాయడంతో పాటు పలు బహుమతులు ఇస్తూ కౌగిలించుకునేవాడు. బాలికతో చనువు పెంచుకోవడానికి వారి ఇంటికి కూడా తరచూ వెళ్లేవాడు. కూతురు చదివే స్కూలు టీచర్ కావడంతో బాలిక పేరెంట్స్ మరోరకంగా ఆలోచించలేకపోయారు. దీనిని అడ్వాంటేజ్ గా తీసుకున్న డ్యూక్.. బాలిక ఫ్యామిలీతోనూ చనువుగా మెలగడం మొదలుపెట్టాడు.

బాలిక స్కూలుకు రాకపోవడంతో ఇంటికి, బాలిక వెళ్లే చర్చికి వెళ్లడం మొదలుపెట్టాడు. ఈ విషయంపై గుర్తుతెలియని వ్యక్తి సమాచారం ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. స్కూలులో డ్యూక్ వస్తువులను, క్యాబిన్ ను డిటెక్టివ్ గాలించగా.. బాలికకు సంబంధించిన పలు ఫొటోలు బయటపడ్డాయి. అయితే, అవేవీ అసభ్యకరంగా లేవని పోలీసులు చెప్పారు. దీంతో డ్యూక్ ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

కోర్టులో నిందితుడి తరఫు లాయర్ వాదిస్తూ.. తన క్లయింట్ డ్యూక్ గతేడాది ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్నాడని జడ్జికి తెలిపాడు. పర్సనల్ బాండ్, పూచీకత్తుతో విడుదల చేయాలని కోరాడు. అయితే, బాలిక తండ్రి దీనికి అభ్యంతరం చెప్పాడు. డ్యూక్ తన ఇంటికి కూడా తరచూ వచ్చేవాడని, అతడి మనసులోని దురుద్దేశం తెలియక తాము అభ్యంతరం పెట్టలేదని చెప్పారు. ఇప్పుడు నిందితుడిని వదిలిపెడితే తమ కూతురికి, తమ కుటుంబానికి హాని తలపెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. కాగా, దీనిపై నిందితుడిని జడ్జి హెచ్చరించారు. జైలు నుంచి విడుదల చేస్తే బాలికను కానీ, ఆమె కుటుంబాన్ని కానీ కలిసేందుకు ప్రయత్నించవద్దని వార్నింగ్ ఇచ్చారు. న్యాయ వర్గాల సమాచారం మేరకు ఈ కేసు విచారణ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

# సెలబ్రెటీలు తాగే పాలు ఇవే.. భాగ్యలక్ష్మీ డెయిరీ

**అమితాబ్ బచ్చన్ నుంచి అంబానీ దాకా ఖాతాదారులే**
**ఏసీలో ఆవులు.. సేంద్రియ పద్ధతిలో గడ్డి పెంపకం**
**ఆవును పరీక్షించి ఆరోగ్యంగా ఉంటేనే పాలు పితకడం**
**దేశంలోనే అతిపెద్ద డెయిరీలలో ఒకటిగా గుర్తింపు**



హైదరాబాద్ పెన్ పవర్:బాలీవుడ్ సెలెబ్రెటీల నుంచి బిజినెస్ టైకూన్ల దాకా.. ప్రముఖుల ఇళ్లల్లో నిత్యం వాడే పాలు మహారాష్ట్రలోని భాగ్యలక్ష్మీ డెయిరీ నుంచే వెళుతుంటాయి. అమితాబచ్చన్ కుటుంబం, ముఖేశ్ అంబానీ ఫ్యామిలీ, హృతిక్ రోషన్, శిల్పాశెట్టి, సల్మాన్ ఖాన్ సహా చాలామంది సెలెబ్రెటీలు ఈ డెయిరీ పాలను ఇష్టపడుతుంటారు. స్వచ్ఛత, ఎలాంటి కృత్రిమ పదార్థాలు కలపకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో ఆవుల నుంచి పాలను సేకరించడమే దీనికి కారణం. అంతేనా.. ఆవుల పెంపకం నుంచి వాటికి వేసే గడ్డి పెంపకంపైనా అత్యంత శ్రద్ధ తీసుకుంటారట. ఈ డెయిరీలో ఉన్న ఆవులు ప్రపంచంలోనే పేరొందిన మేలురకం జాతికి చెందినవి, వీటి పాలల్లో ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్రలోని మంచార్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ డెయిరీకి మూలపురుషుడు దేవేందర్ షా.. హైటెక్ పద్ధతులతో, సెంట్రలైజ్ ఏసీతో నిర్వహించే ఈ డెయిరీ ఆర్గానిక్ పాలను ఉత్పత్తి చేస్తుంటుంది.

**50 ఎకరాల్లో 4 వేల ఆవులతో..**

పాలను ఫ్రెష్ గా వినియోగదారుడికి అందించే ఉద్దేశంతో ఈ డెయిరీ ప్రారంభించినట్లు దేవేందర్ షా చెప్పారు. అందుకే మిగతా డెయిరీల మాదిరిగా కాకుండా ఒకే జాతికి చెందిన ఆవులను ఎంచి విదేశాల నుంచి తెప్పించినట్లు వివరించారు. పూణెకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో 50 ఎకరాల్లో ఉన్న ఈ డెయిరీలో దాదాపు 4 వేలకు పైగా హోల్ స్టెయిన్ ఫ్రెసియన్ జాతి ఆవులు ఉన్నాయి. వేల సంఖ్యలో ఆవులు ఉన్నప్పటికీ డెయిరీ మొత్తం పరిశుభ్రంగా ఉంటుంది. సెంట్రలైజ్ ఏసీలో డెయిరీ సిబ్బంది ఆవులను కంటికిరెప్పలా చూసుకుంటుంటారు. వాటికి ఆహారం కోసం పూర్తిగా సేంద్రీయ పద్ధతిలో గడ్డిని పెంచుతారు.

**ఆవులకు వాకింగ్..**


బరువు అధికంగా ఉన్నఆవులతో రోజుకు మూడు కిలోమీటర్లు వాకింగ్ చేయిస్తారు. రోజంతా మంద్రమైన సంగీతం వినిపించే ఏర్పాట్లు చేశారు. అంతేనా.. ఆవులు పడుకోవడానికి రబ్బరు బెడ్లు, తాగడానికి ఆర్వో వాటర్, 50 మంది వైద్య సిబ్బంది, పేడ, మూత్రం తొలగించడానికి 200 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రతిపూటా ఆవులను పరీక్షించి, ఆరోగ్యంగా ఉన్న వాటి నుంచే పాలను సేకరిస్తారు. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా పాలు పితకరు. ఒక్కో ఆవు రోజూ 25 నుంచి 30 లీటర్ల వరకు పాలిస్తుంది. ఈ పాలల్లో అధిక ప్రొటీన్లు, మైక్రోన్యూట్రియంట్లు, ఎసెన్షియల్ ఫ్యాట్ ఉంటాయి.

**అంతా ఆటోమేటిక్..**

ఆవుల నుంచి సేకరించే క్రమంలో ఎక్కడా పాలను తాకే అవకాశం లేదు. పూర్తిగా ఆటోమేటిక్ పద్ధతిలో సేకరిస్తారు. ఆవు పొదుగుకు పైపులను అమర్చి యంత్రాల సాయంతో పాలు పితుకుతారు. పైపుల ద్వారా పాలు నేరుగా ట్యాంకర్ లోకి, అక్కడి నుంచి బాటిళ్లలో నింపి బయటకు వస్తాయి. వీటిని డైరెక్ట్ గా వినియోగదారులకు అందిస్తారు. 'ప్రైడ్ ఆఫ్ కౌస్' పేరుతో విక్రయించే భాగ్యలక్ష్మీ డెయిరీ పాలను సినిమా, రాజకీయ, వ్యాపార ప్రముఖులు ఇష్టంగా తాగుతుంటారు. ముంబై, పూణే, గుర్ గావ్, బెంగళూరు, చెన్నైలలోని సుమారు 20 వేలమంది వినియోగదారులకు రోజూ పాతికవేల లీటర్ల పాలను ఈ డెయిరీ సరఫరా చేస్తోంది. పెరుగు, వెన్న, పనీర్, చీజ్ వంటి పాల పదార్థాలను కూడా అమ్ముతూ ఏటా ఈ కంపెనీ వెయ్యికోట్ల పైనే ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వాన..

# సోమవారం భారీ వర్షాలు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ లో ఆదివారం (జూలై14) వాన దంచికొడుతోంది. ఉదయం నుంచి మేఘావృతమై ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. చందానగర్, గచ్చిబౌలి, మాదాపూర్ , నిజాంపేట్, ప్రగతినగర్ , పటాన్ చెరు, రామచంద్రాపురం, అమీన్ పూర్ పరిసర ప్రాంతాల్లో వర్షం పడింది. బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ , మెహదీపట్నం పరిసర ప్రాంతాల్లో భారీ కురుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాత్రికూడా హైదరాబాద్ సిటీలో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మరో రెండు రోజులు హైదరాబాద్ నగర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు ఊరటనిచ్చే నిర్ణయం ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:తాళ్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు మరణించిన కల్లు గీత కార్మికుల కుటుంబాలకు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన రూ. 7.90 కోట్ల ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడ గ్రామంలోని తాటి చెట్ల వనంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తాటిచెట్లు ఎక్కేటప్పుడు గీత కార్మికులు ప్రమాదాల బారినపడకుండా రక్షించే కాటమయ్య రక్షణ కవచంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్స్ గ్రేషియా పెండింగ్ అంశంపై కల్లు గీత కార్మికుల కుటుంబాలకు ఊరటనిచ్చే ప్రకటన చేశారు. అంతేకాదు, గీత కార్మికులు తాటి చెట్ల మీద నుంచి పడకుండా తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటి ఆరు పరికరాలతో కూడిన కిట్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కిట్లను రూపొందించింది ఎవరో కాదు... గతంలో పర్వతారోహణ చేసి తెలంగాణ ఖ్యాతిని ఘనంగా చాటిన మాలావత్ పూర్ణ. ఈ సందర్భంగా మాలావత్ పూర్ణ బృందాన్ని రేవంత్ రెడ్డి అభినందించారు.

# ఒక్కో వాచీ ఖరీదు రూ. 2 కోట్లు.. గిఫ్ట్‌గా ఇచ్చిన అనంత్ అంబానీ..

**షారూఖ్, రణ్‌వీర్ తదితరులకు గిఫ్ట్‌గా ఇచ్చిన అనంత్ అంబానీ**

**లగ్జరీ వాచీలకు పేరెన్నికగన్న అడమోర్స్ పిగ్యుట్**

**వాచీలతో ఫొటోలు, వీడియోలకు పోజులు**



హైదరాబాద్ పెన్ పవర్:రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ వివాహం ఈ నెల 12న ఘనంగా జరిగింది. గతేడాది డిసెంబర్‌లో ఎంగేజ్‌మెంట్ తర్వాత దాదాపు ఏడు నెలలపాటు అంబానీ ఇంట వేడుకలు జరిగాయి. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్‌లో వివాహంతో అనంత్-రాధికా ఒక్కటయ్యారు. నిన్న జరిగిన ఆశీర్వాద వేడుకకు భారత ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు, టీమిండియా క్రికెటర్లు సహా ప్రపంచం నలుమూలల నుంచి వేలాదిమంది అతిథులు హాజరయ్యారు. తాజాగా ఇప్పుడు ఈ వేడుకకు సంబంధించిన మరో వార్త వైరల్ అవుతోంది. తనకు స్నేహితులైన బాలీవుడ్ నటులు షారూఖ్‌ఖాన్, రణవీర్‌సింగ్, శిఖర్ పహారియా, వీర్ పహారియా, మీజాన్ జాఫరి తదితరులకు వరుడు అనంత్ అంబానీ ఒక్కొక్కరికీ రూ. 2 కోట్ల విలువైన రిస్ట్ వాచ్‌లు గిఫ్ట్‌గా ఇచ్చారట. ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. లగ్జరీ వాచీలకు పేరెన్నికగన్న అడమోర్స్ పిగ్యుట్ రాయల్ ఓక్ క్యాలెండర్ లిమిటెడ్ ఎడిషన్ వాచీలను వీరు బహుమతిగా అందుకున్నారు. అనంతరం అందరూ కలిసి చేతికి ధరించిన వాచీలు చూపిస్తూ ఫొటోలు, వీడియోలకు పోజిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆకాశం నుంచి కుప్పకూలనున్న 20 ఉపగ్రహాలు!

**నిర్ధారించిన ఎలాన్ మస్క్ కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్**

**ప్రయోగ సమయంలో చోటుచేసుకున్న సాంకేతిక లోపం వల్లేనని ప్రకటన**

**విఫలమైన ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగం**



హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచ కుబేరుడైన ఎలాన్ మస్క్ కు చెందిన సొంత సంస్థ, ప్రైవేటు అంతరిక్ష కంపెనీ స్పేస్ ఎక్స్ తాజాగా చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఒకేసారి 20 ఉపగ్రహాలను భూ కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు స్పేస్ ఎక్స్ ఈ ప్రయోగం చేపట్టింది. కానీ సాంకేతక లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలో కాకుండా దానికన్నా తక్కువ కక్ష్యలోకి ఉపగ్రహాలు ప్రవేశించాయి. దీంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. త్వరలోనే అవి భూమివైపు దూసుకొచ్చి కుప్పకూలనున్నాయి. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ప్రకటించింది. 'గురువారం రాత్రి ప్రయోగం మొదలైన కాసేపటికి ఫాల్కన్ 9 రాకెట్ రెండో దశ ఇంజన్ రెండోసారి మండటం పూర్తిస్థాయిలో జరగలేదు. ఫలితంగా నిర్దేశిత కక్ష్యకన్నా తక్కువ ఎత్తులోనే అవి మోహరించాయి. మొత్తం 20 శాటిలైట్లకుగాను 10 శాటిలైట్లతో మా బృందం కాంటాక్ట్ కాగలిగింది. వాటి ఎత్తు పెంచేలా చేసేందుకు ప్రయత్నించింది. కానీ అది సాధ్యపడలేదు. ఈ ఉపగ్రహాలన్నీ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి పూర్తిగా నశిస్తాయి. వాటి వల్ల ప్రస్తుతం కక్ష్యలో తిరిగే ఇతర ఉపగ్రహాలకు లేదా మనుషులకు ఎలాంటి ముప్పు లేదు' అంటూ వేర్వేరు పోస్ట్ లలో స్పేస్ ఎక్స్ తెలిపింది. అంతకుముందు ఎలాన్ మస్క్ సైతం దీనిపై 'ఎక్స్'లో స్పందించారు. శాటిలైట్లలోని సాఫ్ట్ వేర్ ను అప్ డేట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కానీ ఇదేమీ 'స్టార్ ట్రెక్' ఎపిసోడ్ కానందున ఈ ప్రయత్నం సఫలమయ్యే అవకాశం లేదని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. oo

# ఉయ్యాలలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిపై తాతయ్య అఘాయిత్యం

**విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలంలో ఘటన**

**గ్రామస్థులు వెంబడించడంతో తప్పించుకున్న వృద్ధుడు**

**చికిత్స అనంతరం కోలుకున్న చిన్నారి**


**నార్లవలసలో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్ పెన్ పవర్:విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఊయలలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిపై వరుసకు తాత అయిన వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చిన్నారిని ఊయలలో వేసిన తల్లి కిరాణాషాపుకు వెళ్లడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నార్లవలసకు చెందిన బోయిన ఎరకన్న దొర పసిపాపపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి గుక్కపట్టి ఏడ్వడంతో అక్కడికి చేరుకున్న ఆమె అక్క తల్లికి విషయం చెప్పింది. విషయం గ్రామస్థులకు తెలియడంతో అందరూ కలిసి వృద్ధుడిని వెంబడించారు. అయినప్పటికీ వారికి చిక్కకుండా తప్పించుకున్నాడు. మరోవైపు, తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రం విజయనగరంలోని ఘోష ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పాప కోలుకున్నట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నార్లవలసలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# హత్యలకు, దాడులకు గురైన అమెరికా అధ్యక్షులు, అధ్యక్ష అభ్యర్థులు వీరే

- అమెరికా చరిత్రలో కాల్పులకు బలైన నలుగురు దేశాధ్యక్షులు
- మరికొందరు గాయాలతో బయటపడ్డ వైనం
- 1865లోనే అగ్రరాజ్యంలో వెలుగులోకి వచ్చిన కాల్పుల సంస్కృతి



హైదరాబాద్ పెన్ పవర్:అమెరికా మాజీ అధ్యక్షుడు, మరోసారి దేశాధ్యక్ష పోటీలో ఉన్న రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై శనివారం పెన్సిల్వేనియాలో హత్యాయత్నం జరగడం తెలిసిందే. అయితే ఇదేమీ తొలి సంఘటన కాదు. అమెరికా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ గతంలోనూ పలుమార్లు హత్యాయత్నాలు జరిగాయి. మొత్తంగా నలుగురు అమెరికా అధ్యక్షులు దుండగుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. వాళ్లు ఎవరంటే...

**అబ్రహం లింకన్**

అమెరికా 16వ అధ్యక్షుడిగా లింకన్ పనిచేశారు. 1865 ఏప్రిల్ 14న ఆయన హత్యకు గురయ్యారు. వాషింగ్టన్ లోని ఫోర్డ్స్ థియేటర్ లో తన భార్య మేరీ టాడ్ లింకన్ తో కలిసి కార్యక్రమాన్ని వీక్షిస్తుండగా జాన్ విల్కిస్ బూత్ అనే దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఆయన తల వెనకాల తూటా తగిలింది. హుటాహుటిన సమీప ఆసుప్రతికి తరలించినప్పటికీ మర్నాటి ఉదయం కన్నుమూశారు. అమెరికాలో 1863లో జరిగిన అంతర్యుద్ధంలో నల్ల జాతీయుల హక్కులకు లింకన్ మద్దతు పలకడంతోపాటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బానిసలుగా పనిచేస్తున్న నల్లజాతీయులకు స్వేచ్ఛ కల్పిస్తూ ఆదేశాలివ్వడం ఆయన హత్యకు కారణమైంది.

**జేమ్స్ ఎ. గ్యారిఫీల్డ్**

అమెరికా 20వ అధ్యక్షుడిగా గ్యారిఫీల్డ్ వ్యవహరించారు. అధికారం చేపట్టిన ఆరు నెలలకే హత్యకు గురైన రెండో దేశాధ్యక్షుడు. 1881 జులై 2న న్యూ ఇంగ్లాండ్ కు వెళ్లడం కోసం వాషింగ్టన్ స్టేషన్ లో రైలు ఎక్కేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా చార్లెస్ గీటూ అనే దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆయన ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. అయినప్పటికీ ఆయన కొన్ని వారాలపాటు వైట్ హౌస్ లో జీవించారు. టెలిఫోన్ ను కనిపెట్టిన గ్రాహం బెల్ ఒక ప్రత్యేక పరికరం ద్వారా గ్యారిఫీల్డ్ శరీరంలోకి దూసుకెళ్లిన తూటా ఎక్కడుందో గుర్తించేందుకు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. చివరకు సెప్టెంబర్ లో న్యూజెర్సీలో ఆయన కన్నుమూశారు. చార్లెస్ గీటూకు 1882 జూన్ లో మరణశిక్ష అమలు చేశారు.

**విలియం మెక్ కిన్లే**

అమెరికా 25వ అధ్యక్షుడిగా మెక్ కిన్లే పనిచేశారు. న్యూయార్క్ లోని బఫెలో నగరంలో 1901 సెప్టెంబర్ 6న ప్రసంగం ముగించిన కాసేపటికే ఆయనపై కాల్పులు జరిగాయి. ప్రజలకు అభివాదం చేస్తుండగా లియోన్ ఎఫ్. జోల్గోజ్ అనే నిరుద్యోగి పాయింట్ బ్లాంక్ రేంజ్ లో కాల్పులు జరపడంతో ఆయన ఛాతీలోకి రెండు తూటాలు దూసుకెళ్లాయి. ఆయన కోలుకుంటారని వైద్యులు భావించినప్పటికీ గ్యాంగ్ రీన్ వల్ల గాయపడిన ప్రదేశం కుళ్లిపోవడంతో ఆరోగ్యం క్షీణించి 1901 సెప్టెంబర్ 14న ఆయన మరణించారు. రెండోసారి అధికారం చేపట్టిన ఆరు నెలలకే కన్నుమూశారు. దీంతో 1901 అక్టోబర్ 29న విద్యుత్ షాక్ ద్వారా లియోన్ ఎఫ్. జోల్గోజ్ కు మరణశిక్ష అమలు చేశారు.

**జాన్ ఎఫ్ కెన్నెడీ**

అమెరికా 35వ అధ్యక్షుడు. 1963 నవంబర్ లో తన సతీమణి జాక్వెలీన్ కెన్నెడీతో కలిసి జాన్ ఎఫ్. కెన్నెడీ తన కాన్వాయ్ లో డాలస్ లోని డీలీ ప్లాజా మీదుగా వెళ్తుండగా ఆయనపై కాల్పులు జరిగాయి. లీ హార్వే ఓస్వాల్డ్ అనే దుండగుడు ఆయనపై హైపవర్ రైఫిల్ తో దూరం నుంచి కాల్పులు జరిపాడు. దీంతో ఆయన్ను హుటాహుటిన పార్క్ ల్యాండ్ మెమోరియల్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దీంతో అప్పటి ఉపాధ్యక్షుడు లిండన్ బి. జాన్సన్ అధ్యక్షుడిగా ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రమాణం చేశారు. తద్వారా ఈ విమానంలో ప్రమాణస్వీకారం చేసిన ఏకైక దేశాధ్యక్షుడిగా ఆయన నిలిచారు. కెన్నెడీ హత్య జరిగిన రెండు రోజులకు లీ హార్వే ఓస్వాల్డ్ ను జైలుకు తరలించగా అక్కడ జాక్ రూబీ అనే నైట్ క్లబ్ యజమాని అతన్ని కాల్చి చంపాడు.

**ఫ్రాంక్లిన్ డి. రూస్ వెల్ట్**

అమెరికా 32వ అధ్యక్షుడిగా ఎన్నికైన రూస్ వెల్ట్ 1933 ఫిబ్రవరిలో మయామీలో ప్రమాణస్వీకారం చేసే ముందు ప్రసంగిస్తుండగా ఆయన్ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిగాయి. గిసెప్పే జంగారా అనే దుండగుడు తన కారులోంచి కాల్పులు జరిపాడు. అయితే ఈ కాల్పుల నుంచి రూస్ వెల్ట్ ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. కానీ రూస్ వెల్ట్ పక్కన నిలబడిన షికాగో మేయర్ ఆంటన్ సెర్మక్ ఈ కాల్పుల్లో మరణించారు. ఈ కేసులో దోషిగా తేలిన జంగారాకు ఆ తర్వాత కొంతకాలానికి మరణశిక్ష అమలు చేశారు.

**హ్యారీ ఎస్. ట్రూమన్**

అమెరికా 33వ అధ్యక్షుడిగా పనిచేశారు. 1950 నవంబర్ లో వైట్ హౌస్ సమీపంలోని బ్లెయిర్ హౌస్ లో నివసిస్తుండగా తుపాకులతో ఇద్దరు దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. అయితే ఈ ఘటనలో ఆయనకు ప్రాణహాని తప్పింది. దుండగులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక దుండగుడు, ఒక పోలీసు అధికారి మృతి చెందారు. మరో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. దుండగుల్లో మరొకరైన ఆస్కార్ కొలాజోను పోలీసులు అరెస్టు చేశారు. అతనికి కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పగా 1952లో ట్రూమన్ మాత్రం అతని మరణశిక్షను యావజ్జీవంగా మార్చారు. చివరకు 1979లో అప్పటి అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ కొలాజోకు క్షమాభిక్ష పెట్టి విడుదల చేశారు.

**గెరాల్డ్ ఫోర్డ్**

అమెరికా 38వ అధ్యక్షుడైన గెరాల్డ్ ఫోర్డ్ పై 1975లో కొన్ని వారాల వ్యవధిలోనే రెండుసార్లు హత్యా యత్నాలు జరిగాయి. అయితే ఆ రెండు ఘటనల్లోనూ అదృష్టవశాత్తూ ఆయన ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. నాటి క్యాలిఫోర్నియా గవర్నర్ ను శాక్రామెంటోలో కలిసేందుకు ఫోర్డ్ వెళ్తుండగా జనంలోకి ఒక్కసారిగా దూసుకొచ్చిన లినెట్ ఫ్రోం అనే దుండగుడు ఆయనకు సెమీ ఆటోమెటిక్ పిస్టల్ ను గురిపెట్టాడు. కానీ ఆ సమయంలో తుపాకీ పేలలేదు. ఇది జరిగిన 17 రోజులకే సారా జేన్ మూరే అనే మహిళ శాన్ ఫ్రాన్సిస్కోలో ఫోర్డ్ ను అడ్డగించి కాల్పులు జరిపింది. కానీ ఆయనకు తూటా తగల్లేదు. ఈ రెండు సంఘటనల్లోనూ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. లినెట్ ఫ్రోంను 2009లో జైలు నుంచి విడుదల చేయగా మూరేను 2007లోనే జైలు నుంచి విడిచిపెట్టారు.

**రొనాల్డ్ రీగన్**

అమెరికా 40వ అధ్యక్షుడు. 1981 మార్చిలో వాషింగ్టన్ లో ప్రసంగం అనంతరం తన కాన్వాయ్ లో బయలుదేరగా జాన్ హింక్లే జూనియర్ అనే దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో రీగన్ తోపాటు ఆయన మీడియా కార్యదర్శి జేమ్స్ బ్రాడీ, మరో ఇద్దరు గాయపడ్డారు. అయితే పిచ్చితనం వల్ల కాల్పులు జరిపినందుకు జాన్ హింక్లే జూనియర్ ను కోర్టు నిర్ధోషిగా తేల్చింది. కానీ మెంటల్ హాస్పిటల్ లో చేర్పించాలని ఆదేశించింది. అయితే అతని వల్ల సమాజానికి ఎలాంటి ముప్పు లేదని కోర్టు తేల్చడంతో చివరకు 2022లో అతన్ని ఆసుపత్రి నుంచి విడుదల చేశారు.

**జార్జి డబ్ల్యూ. బుష్**

అమెరికా 43వ అధ్యక్షుడిగా పనిచేశారు. 2005లో తిబిలిసీలో జార్జియా అధ్యక్షుడు మిఖాయిల్ సాకాష్ విలీతో కలిసి బుష్ ఓ బహిరంగ సభకు హాజరవగా వారిని హతమార్చేందుకు ఓ దుండగుడు బట్టలో చుట్టిన గ్రెనేడ్ విసిరాడు. అయితే గ్రెనేడ్ వారికి దాదాపు 100 అడుగుల దూరంలో పడటం, పేలకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వ్లాదిమర్ ఆర్యుత్యినియన్ అనే దుండగుడిని కోర్టు ఈ కేసులో దోషిగా తేల్చి యావజ్జీవ జైలు శిక్ష విధించింది.

**రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ**

అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన జాన్ ఎఫ్. కెన్నెడీ సోదరుడు. అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం 1968లో డెమొక్రటిక్ పార్టీ తరపున రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ పోటీలో నిలిచారు. క్యాలిఫోర్నియా ప్రైమరీ ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా లాస్ ఏంజిలెస్ లోని ఓ హెూటల్ లో ప్రసంగిస్తుండగా సిర్హాన్ అనే దుండగుడు జరిపిన కాల్పుల్లో మరణించారు. ఈ కాల్పుల్లో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ కేసులో కోర్టు సిర్హాన్ ను దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. ఆ తర్వాత దాన్ని యావజ్జీవంగా మార్చింది.

**జార్జి వాలెస్**

దేశాధ్యక్ష బరిలో నిలిచేందుకు డెమొక్రటిక్ పార్టీ తరఫున 1972లో పోటీ చేశారు. అప్పుడు ఆయన అలబామా గవర్నర్ గా ఉన్నారు. మేరీల్యాండ్ లో ప్రచారం కోసం వచ్చిన ఆయనపై ఓ దుండగుడు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో వాలెస్ గాయపడ్డారు. ఆయన నడుం కింది భాగం చచ్చుబడిపోవడంతో జీవితాంతం చక్రాల కుర్చీకే పరిమితం అయ్యారు. అయినప్పటికీ 1974లో మళ్లీ అలబామా గవర్నర్ గా పోటీ చేసి గెలిచారు. 1998 సెప్టెంబర్ 13న కన్నుమూశారు. ఈ కేసులో ఆర్థర్ బ్రెమర్ అనే దుండగుడిని కోర్టు దోషిగా తేల్చి జైలుశిక్ష విధించింది. 2007లో అతను జైలు నుంచి విడుదలయ్యాడు.

# పండగ పూట విషాదం : పెద్ద పులి వేషం కట్టి గుండెపోటుతో మృతి

హైదరాబాద్ పెన్ పవర్:%జగిత్యాల జిల్లా: మాల్యాల మండల కేంద్రంలో ఆదివారం పండగ పూట విషాదం చోటుచేసుకుంది. మొహారం సందర్భంగా బెజ్జారపు లక్ష్మణ్(24) అనే యువకుడు పెద్దపులి వేషం వేసి ఊరేగింపులో డ్యాన్స్ చేశాడు. పెద్దపులి వేషంలో డాన్స్ చేసిన తర్వాత లక్ష్మణ్ ఇంటికి వచ్చి మంచంలో పడుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎంత పిలిచినా లక్ష్మణ్ ఉలుకూ పలుకు లేదు. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మణ్ గుండెపోటుతో చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ గా పనిచేస్తున్న లక్ష్మణ్ మొహర్రం పండగ సంర్భంగా పులివేశధారణలో ఊరేగింపులో డ్యాన్స్ చేసి వచ్చి ఇంట్లో గుండెపోటుతో చనిపోయినట్లు బంధువులు చెప్తున్నారు.





# నిరుద్యోగుల ధర్నా ఫొటోలు షేర్ చేస్తూ కాంగ్రెస్ సర్కార్ పై బండి సంజయ్ ఫైర్

- రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన 'మొహబ్బత్ కీ దుకాన్' ఇదేనా అంటూ ప్రశ్న
- గ్రూప్ 2 వాయిదా వేయాలంటూ హైదరాబాద్ లో నిరుద్యోగుల ధర్నా
- నిరుద్యోగులతో సామరస్యపూర్వకంగా చర్చించాలని డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి



హైదరాబాద్ పెన్ పవర్:కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ తెలంగాణ నిరుద్యోగులకు మద్ధతు పలికారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలన్న డిమాండ్ కు అనుకూలంగా మాట్లాడారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన 'మొహబ్బత్ కీ దుకాణ్' ఇదేనా అంటూ నిలదీశారు. వెంటనే నిరుద్యోగులతో సామరస్యపూర్వకంగా చర్చించి, వారి ఆందోళనను విరమింప చేయాలని రేవంత్ రెడ్డి సర్కారును డిమాండ్ చేశారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ నిరుద్యోగులు శనివారం రాత్రి చిక్కడ్ పల్లి నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆపై ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద బైఠాయించారు. ఈ ధర్నాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను బండి సంజయ్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఇదే అశోక్ నగర్ లో గత ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ పలు హామీలు ఇచ్చారు. ఆయన నిరుద్యోగ యువతకు ఇచ్చిన "మొహబ్బత్ కీ దుకాన్" ఇదేనా?' అంటూ ప్రశ్నించారు. నిరసనలను అణచివేయాలని చూడకుండా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ ఆశావహులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. వారి మనోవేదనను తొలగించాలని కోరారు. పరీక్షల షెడ్యూలింగ్, పోస్టుల పెంపు, ఉద్యోగాల క్యాలెండర్‌కు సంబంధించిన సమస్యలకు సానుకూల పరిష్కారం వెతకాలని సూచించారు. ఈమేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.

# హిందువుల తొలి పండుగ ఏదో తెలుసా..

హైదరాబాద్ పెన్ పవర్:హిందువుల తొట్టతొలి పండుగగా తొలి ఏకాదశిని పేర్కొంటారు. హిందువుల ప్రధానమైన పండుగలకు తొలి ఏకాదశితోనే శ్రీకారం చుడతారు. తొలి ఏకాదశి తర్వాతే వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగలు వస్తాయి. హిందూ సంప్రదాయంలో తొలి ఏకాదశికి విశేష ప్రాధాన్యత ఉంది. తెలుగు రాష్ట్రాల్లో తొలి ఏకాదశికి విశేష ప్రాధాన్యతనిస్తారు. దీన్నే శయన ఏకాదశి, హరివాసరం, పేలాల పండగ' అని వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. ఆషాడంలో వచ్చే శుక్ల ఏకాదశి నాడు ప్రజలందరూ ఈ తొలి ఏకాదశి పర్వదినాన్ని జరుపుకుంటారు. ఈ ఏడాది జులై 17న తొలి ఏకాదశి వస్తున్న నేపథ్యంలో ఈ పండగ విశేషాలు తెలుసుకుందాం.



ఒక సంవత్సరంలో 24 ఏకాదశులు వస్తాయి. వీటిలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశిగా'గా పేర్కొంటారు. పురాణాల ప్రకారం.. శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై నాలుగు నెలల పాటు శయనిస్తాడు. తిరిగి అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో వచ్చే 'ప్రబోధినీ ఏకాదశి' నాడు తిరిగి నిద్ర లేస్తాడు. చాతుర్మాస వ్రతం కూడా ఈ ఏకాదశి నాడు మొదలవుతుంది. దీనిని దేవ శయన ఏకాదశి లేదా హరి శయన ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజు ( జులై 17) నుంచి దేవతలకు రాత్రిపూట మొదలవుతుంది, విష్ణువు పగటిపూట విశ్రాంతి తీసుకుంటాడని చెబుతారు. అంతేగాక ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు.

**నిజంగానే విష్ణువు ఆ రోజు నిద్రపోతారా..**

నిజంగా విష్ణువు నిద్రపోతారా లేదా నిద్రకు మరేదైనా అర్థం ఉందా అంటే..చైతన్య స్థాయిలో ఎప్పుడూ మెలకువగా ఉండే వ్యక్తిని దేవుడిగా భావిస్తారు. అలాంటి పరిస్థితిలో ఎప్పుడూ మెలకువగా ఉండే భగవంతుడు అంత కాలం ఎలా నిద్రపోతాడు? అంటే దీనిలో దాగి ఉన్న రహస్యం.. ప్రజలు సాంప్రదాయ ఆచారాలను అనుసరించి వారి జీవితాన్ని కాలానుగుణంగా ఏర్పాటు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో పెట్టినవి. ఆ రోజు నుంచి ఒంటి పూట భోజనం, జాగరణ వంటి వాటితో ఆరోగ్యంగాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో సామాన్య ప్రజల కోసం ఋషులు ఏర్పాటు చేసినవి. నిశితంగా ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు, సూర్య చంద్రులు, గ్రహాలు పరస్పర సంబంధాన్నీ, వాటి గమనాన్ని బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు.తొలిఏకాదశి ఆషాఢ మాసంలో వస్తుంది. కొన్ని రోజుల తర్వాత.. శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. శ్రావణ మాసం వర్షాకాల మాసం. వర్షాకాలం ముగిసిన తరువాత.. శరదృతువు ప్రారంభమవుతుంది. అంటే ఈ చాతుర్మాస్య దీక్ష స్వీకరించే నాలుగు మాసాలు రుతువులు మారే మాసాలు. వాతావరణం మారినప్పుడు మన శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. దగ్గు, జలుబు , ఫ్లూలతోపాటు ఇన్ఫెక్షన్ వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరుగుతుంది. అన్ని కూరగాయలు , పండ్లలో బ్యాక్టీరియా, కీటకాలు పెరగడం ప్రారంభిస్తాయి. వర్షం కారణంగా సాధారణ వ్యక్తి తన జీవితాన్ని ఇంటి వద్దనే ఎక్కువగా గడిపేస్తాడు. ఈ కారణంగా ఈ నాలుగు మాసాలలో శుభకార్యాలు చేయవద్దని.. ఆహార పానీయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, సంయమనం పాటించేందుకు ఈ వ్రత నియమాలను ఏర్పాటు చేశారు.

**ఏకాదశి తిథి ఎలా వచ్చిందంటే..**

తాళజంఘుడు అనే రాక్షసుడి కుమారుడు మురాసురుడితో యుద్ధం చేసిన శ్రీ మహావిష్ణువు అలసిపోయి శయనిస్తాడు. దేవదేవుడు యోగనిద్రలో ఉండడం అదునుగా భావించిన దానవులు దేవతలపై విజృంభించారు. దీంతో దేవతలు భయపడి వైకుంఠధామానికి పరుగులు తీయడంతో భగవానుడి శరీరం నుంచి ఉద్భవించిన 'సత్త్వశక్తి' దానవుల దాష్టీకాన్ని కట్టడి చేసింది. యోగనిద్ర నుంచి మేల్కొన్న పరంధాముడు ఆ శక్తికి 'ఏకాదశి' అని పేరుపెట్టాడు. ఆమె సమయస్ఫూర్తికి, సకాలంలో సహకరించి నందుకు సంతసించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకంలో పూజలు అందుకోవాలని కోరుకుందట. అప్పటి నుంచి ఆమె 'ఏకాదశి' తిథిగా వ్యవహారంలోకి వచ్చింది.

**వ్రతం ఆచరించు విధానం..**

ఈ వ్రతాన్ని ఆచరించదలచినవారు దశమి నాడు రాత్రి నిహారులై ఉండి ఏకాదశినాడు సూర్యోదయానికి ముందుగా కాలకృత్యాలు తీర్చుకుని శ్రీహరిని పూజించాలి. ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి. అసత్యమాడరాదు. స్త్రీ సాంగత్యం పనికి రాదు. కాని పనులు, దుష్ట ఆలోచనలు చేయకూడదు. ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి. మర్నాడు అనగా ద్వాదశి నాడు ఉదయాన్నే కాలకృత్యాదుల అనంతరం శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి. అన్నదానం చేయడం చాలా మంచిది. అలాగే ఈ వ్రతమాచరించే వారు కాల్చి వండినవి, మాంసాహారం, పుచ్చకాయ, గుమ్మడికాయ, చింతపం డు, ఉసిరి, ఉలవలు, మినుములు తీసుకోకూడదు. అదేవిధంగా మంచంపై శయనించ కూడదని పురాణాలు చెబుతున్నాయి. మానవ జాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేసాడనీ... ఈ వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ, మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణంలో పేర్కొన్నట్లు పండితులు చెప్తుంటారు. తొలి ఏకాదశి రోజున పిండిదీపం పెట్టాలి. ఈ రోజు పేలాల పిండి తినడం ఆచారం. ఉపవాసం ఉండే వారి నియమాలు యథావిధి. అలా కాకుండా కొన్ని ప్రాంతాల్లో తొలి ఏకాదశిని పండుగులా జరుపుకునే ఆచారం కూడా ఉంది.

**రైతులకు కూడా పండుగే..**

ఏరువాక లాగే తొలి ఏకాదశిని వేడుక చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని, పైరుకు ఏ రకమైన తెగుళ్ళు సోకకూడదని, ఇతరత్రా ఏ సమస్యలూ ఎదురవకూడదని దణ్ణం పెట్టుకుంటారు.

**ఈ మాసంలోనే బోనాలు, పశుపూజ..**

తొలి ఏకాదశి రోజున శేషసాయిని(విష్ణువు) పూజించి..అలా ప్రతినెలా వచ్చే ఏకాదశిని విడిచిపెట్టకుండా శ్రీహరిని పూజిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పండితులు అంటున్నారు. అంతేగాదు అనాదిగా సాధువులు, భక్తజనులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి శ్రీ విష్ణుసాయుజ్యం పొందినట్లు పురాణాలు చెబుతున్నాయి. అంబరీషుడు, మాంధాత, తదితర పురాణ పురుషులు ఏకాదశి వ్రతాన్ని ఆచరించారు.

సూర్యవంశ చక్రవర్తి, సత్యసంధుడు మాంధాత, తన రాజ్యంలో అనావృష్టి నెలకొన్నప్పుడు అంగిరసుడి సూచనపై 'శయనైక ఏకాదశి' వ్రతాన్ని భక్తితో చేశాడని, ఫలితంగా వర్షాలు కురిసి పరిస్థితి చక్కబడిందని పురాణాలు చెపుతున్నాయి. పైగా సతీ సక్కుబాయి కూడా ఈ శయన ఏకాదశి నాడే మోక్ష ప్రాప్తి పొందారట. అలాగే ఈ మాసంలోనే బోనాలు, పశుపూజ, శకట ఆరాధనలు చేస్తారు.

# ఖండాంతరాలు దాటిన తెలంగాణ బోనాలు.. ఆస్ట్రేలియాలో ఘనంగా జాతర



హైదరాబాద్ పెన్ పవర్:ఆస్ట్రేలియాలోని ఆషాడ మాస బోనాల జాతర ఘనంగా జరిగింది. తెలంగాణ ప్రజలంతా ఒక్కచోటికి చేర్చి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెల్‌బోర్న్ నగరంలో రాక్‌బ్యాంక్ దుర్గామాత ఆలయంలో ఘనంగా బోనాల జాతర జరిగింది. గత 10 సంవత్సరాలుగా ఆస్ట్రేలియాలో బోనాలను నిర్వహిస్తున్న మెల్‌బోర్న్ బోనాలు సంస్థ ఈసారి కూడా బోనాల పండుగను అట్టహాసంగా నిర్వహించింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో రాక్‌బ్యాంక్ దుర్గామాత ఆలయంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. గత 10 సంవత్సరాలుగా ఆస్ట్రేలియాలో బోనాలను నిర్వహిస్తున్న మెల్‌బోర్న్ బోనాలు సంస్థ ఈసారి కూడా బోనాల పండుగను అట్టహాసంగా నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు, తొట్టెలు సమర్పించారు. తమ మొక్కులను చెల్లించుకున్నారు.
పోతురాజుల ఆటలు, యువకుల పాటలు నృత్యాలతో బోనాల జాతర కన్నుల పండవగా సాగింది. బోనాల పాటలకు తెలంగాణ యువకులతో పాటు భారత్‌లోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు కూడా డ్యాన్సులు చేయడం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మెల్‌బోర్న్ బోనాలు సంస్థ నిర్వాహకులు తెలంగాణ మధు, రాజు వేముల, దీపక్ గద్దె, ప్రజీత్ రెడ్డి కోతిలను వివిధ సంఘాల నాయకులు, ప్రజలు అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు. ఆషాడం మాసం వచ్చిందంటే చాలు రాష్ట్రంలోని ప్రతి పల్లెలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించుకోవడం తెలంగాణ సాంప్రదాయం. ఇక హైదరాబాద్ లో అయితే నెల రోజులు పాటు ప్రతి ఆదివారం ఏదో ఒకచోట(సికింద్రాబాద్, లాల్ దర్వాజ) ఈ బోనాల పండగ అంగరంగవైభవంగా జరుగుతుంది. ఇప్పుడు ఈ తెలంగాణ బోనాలు సంస్కృతి విదేశాలకు కూడా పాకింది. ఖండాంతరాలు దాటిన తెలంగాణ బోనాలు ఆస్ట్రేలియాలో మరింత వైభవంగా జరిగాయి.
ఈ సందర్భంగా తెలుగు సాంప్రదాయ దుస్తుల్లో మెల్‌బోర్న్ నగరంలో రాక్‌బ్యాంక్ దుర్గామాత ఆలయానికి విచ్చేసిన మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. తెలంగాణకు చెందిన వారంతా ఒకే కుటుంబ సభ్యుల మాదిరిగా కలిసి మెలిసి ఆనందంగా గడిపారు. బోనాలతో పాటు అమ్మవారికి తొట్టెలలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల ఆటా, పాటలతో యువకుల నృత్యాలతో దుర్గామాత ఆలయంలో ఎంతో సందడిగా ఈ వేడకలు జరిగాయి. ఇక ప్రత్యేకమైన బోనాల పాటలకు తెలంగాణ వారే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా మైమరిచిపోయి నృత్యాలు చేయడం ఈ వేడుకకే హైలైట్ గా నిలిచింది.


## డాక్టర్‌కు నర్సుతో అఫైర్ : భార్యాబిడ్డలను ఎలా చంపాడో తెలిస్తే.. షాక్!



హైదరాబాద్ పెన్ పవర్:ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం హర్యాతండా మే 28న జరిగిన కారు యాక్సిడెంట్ వెనుక ఉన్న కుట్రను పోలీసులు చేదించారు. ఖమ్మం ఏసిపి రమణ మూర్తి ప్రెస్ మీట్ లో కేసులో విషయాలు తెలిపారు. ఇద్దరు పిల్లలు కృషిక(5), క్రితన్య(2)తో సహ భార్య కుమారి(25) లు మృతి చెందిన కేసులో పోలీసులు నిజాలు బయటపెట్టారు. కుమారి(25)భర్త బోడ ప్రవీణ్ నాయక్ విషం ఇచ్చి వారిని చంపి ఆక్సిడెంట్ గా చిత్రీకరించాడు. భార్యతో సహా పిల్లలను చంపి గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేసేందుకు ఇంటికి తీసుకొచ్చే క్రమంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని, దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్టు మృతురాలి బంధువులు ఆరోపించి, ఆందోళన చేపట్టారు. ప్రవీణ్ మగసంతనం కోసం కేరళకు చెందిన నర్సుతో సహజీవనం చేస్తున్నాడు. పెద్దలు పంచాయితీ నిర్వహించి వీరి మృతికి 20 రోజుల క్రితమే కుమారి, ప్రవీణ్ లను కలిపారు. బోడా ప్రవీణ్ హైదరాబాద్ ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడ కేరళకు చెందిన ఓ నర్సుతో విహేతేర సంబంధం పెట్టుకున్నాడు. భార్య, పిల్లలను అడ్డ తొలగించుకుందామని అనస్థీషియా ఓవర్ డోస్ ఇంజెక్షన్ తో వారిని హత్య చేశాడు ప్రవీణ్. మృతదేహాలను తరలిస్తుండగా కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. వారి చావుకు యాక్సిడెంటే కారణమని చిత్రీకరించాడు. పోలీసులు విచారణ, పోస్టుమార్టంలో అసలు విషయాలు బయటకు వచ్చాయి.

## పెన్షన్ రికవరీలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




GOVERNMENT OF TELANGANA
GENERAL ADMINISTRATION (GENERAL,L&C) DEPARTMENT

U.O.Note.No.6446/Genl.,L&C/2024. Dated:14.07.2024.

Sub:- Ineligible beneficiaries in welfare schemes – Not to recover till further Instructions – Communicated – Reg.

****

It has come to the notice of the Government that several instances have occurred where beneficiaries who are ineligible have been included for the grant of benefits under various welfare schemes.

The Government has undertaken widespread consultations to streamline these welfare schemes to ensure better and more efficient targeting of eligible beneficiaries. The issues identified and potential solutions are likely to be discussed during the forthcoming Budget session of the State Legislature. The Government will soon issue clear guidelines aimed at ensuring better targeting of welfare scheme benefits and establishing procedures for the recovery (in cases and schemes deemed necessary) of undue benefits received by clearly ineligible persons.

Until such guidelines are issued, all Departments of Secretariat and District Collectors are hereby instructed not to initiate any steps for issuing notices or recovering amounts from beneficiaries who have been included in various welfare schemes of the Government.

SANTHI KUMARI
CHIEF SECRETARY TO GOVERNMENT

To
All the Special Chief Secretaries, Principal Secretaries, Secretaries, Special Secretaries to Government.

హైదరాబాద్ పెన్ పవర్:పించన్ రికవరీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పింఛన్ రికవరీలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రికవరీ నోటీసులపై ప్రభుత్వం అధికారులకు క్లారిటీ ఇచ్చింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనర్హులకు లబ్ధి, రికవరీపై చర్చించాలని నిర్ణయించినట్లు సీఎస్ శాంతి కుమారి చెప్పారు.
తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరేలా త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామన్నారు. తదుపరి ఉత్తర్వుల వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దని సీఎస్ శాంతికుమార్ ఉత్తర్వుల్లో తెలిపారు.
గత బీఆర్ ఎస్ ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చిన పింఛనలో అవకతవకలు జరిగాయని.. అనర్హులు ఆసరా పింఛన్లు పొందారని వాటిని
వెనక్కి తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నాటికి 1823 మందికి రికవరీ నోటీసులు జారీ చేసినట్లు ప్రకటించారు.. పింఛన్లు తొలగించనున్న 1826 మంది జాబితాను రాష్ట్ర స్థాయి అధికారులు ఇప్పటికే జిల్లాలకు పంపించినట్లు తెలుస్తోంది.